# ఓ కప్పు కాఫీ

సులోచన ఇంట్లోకి అడుగుపెడుతూ చూసింది. శివరామ్ కుర్చీలో వెనక్కి చేరబడి కళ్ళుమూసుకుని ఉన్నాడు. పక్కన విప్పిన షూ ఉంది. వచ్చి ఎంతసేపయిందో. మధ్య టేబుల్‌మీద అరటిపళ్ళు రెండు, ఒక ఆపిల్ ఉన్నాయి. పిల్లలు పళ్లు తిని ఆడుకోవటానికి వెళ్ళారన్నమాట. హ్యాండ్‌బ్యాగ్ టేబుల్‌మీద పడేసి కుర్చీలో కూలబడింది సులోచన. అలసటగా కళ్ళుమూసుకుంది. పొద్దుటి నుంచి పడుతున్న అలసట తీరుతున్నట్లుగా ఉంది కళ్ళుమూసుకుంటే.

శివరామ్ కళ్ళు తెరిచాడు. సులోచనవైపు చూస్తూ ''కాఫీ'' అన్నాడు.

సులోచన మెల్లగా కళ్ళు తెరిచి అతడిని చూసింది. కళ్ళు పూర్తిగా విప్పుకుని అతడికేసి తదేకంగా అరనిముషం చూసింది. శివరామ్‌కు చిరాకువేసింది.

తనేదో అడగకూడనిది అడిగినట్లు అలా చూస్తుందేం? హాయిగా ఎలా కూర్చుందో!

''వినపడలేదా? కాఫీ!'' అన్నాడు.

''నాకేం చెముడు లేదు'' అంది కాని కదలలేదు.

''చెముడు లేదు కానీ బద్ధకం ఉంది'' పరిహాసం చేస్తున్నా ననుకున్నాడు. ''అలాగని ఎలా అనగలుగుతున్నారు?'' అంది బాధపడుతున్నట్లు. ''మరి ఆఫీసునుంచి చచ్చీ చెడి వచ్చానా! కాఫీ కాఫీ అని ఐదు నిముషాల నుంచి అడుగుతున్నాను. వులకవు పలకవు.''

''మీరే కాదు. నేనూ స్కూల్‌నుంచి చచ్చీచెడి వచ్చాను. మీటింగ్‌కూడా ఉందివాళ. అలసిపోయి వచ్చాను''. మళ్ళీ కళ్ళు మూసుకోబోయింది. ''అలసిపోయానూ, అలసిపోయానూ అంటూ ఎప్పుడూ అదేమాట!'' అన్నాడు. చటుక్కున సులోచన కళ్ళు తెరుచుకున్నాయి. చురుకుగా చూస్తూ,

''మీరు ఆఫీసునుంచి అలసిపోయి రావటంలేదూ? మీలాగే నేనూ మనిషినే. ప్రొద్దున్నే లేచి వంటంతా చెయ్యటం లేదూ. మీకూ పిల్లలకి వడ్డించటం, టిఫిన్ సర్ది ఇవ్వటం నేనే కదూ చేసేది. పనిమనిషి చేత పనులు చేయించాలి. పాఠాలు ప్రిపేరవ్వాలి. స్కూల్లో ఐదుగంటలసేపు పిల్లలతో అరిచి వస్తాను. ఇంటికి వచ్చేటప్పటికి పని సిద్ధంగా ఉంటుంది. ఎవరేనా వేడివేడిగా ఓ కప్పు కాఫీ ఇస్తే....'' ''అందుకే ఉద్యోగం వద్దూ అంటే విన్నావూ!'' అన్నాడు శివరామ్ వెంటనే. సులోచన కళ్ళు నిప్పుకణికల్లాగ రాజుకున్నాయ్.

''ఔను వద్దంటారు. మీకు సౌఖ్యాలు అమరవని! మీ హక్కులు ఎక్కడ పోతాయో అని బాధ. ఉద్యోగం చేస్తున్నానని ఎందుకట్లాగ బాధపడిపోతారూ! భార్యలు తమ మాట వినరని. తమ సుఖాలకి తిలోదకాలేనని భయం మీ మగవాళ్ళకి. అంతేకదూ'' అంది.

''భయానికేముంది! ఎంత ఇబ్బందిపడుతున్నామో చూడు!'' అన్నాడు. నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తున్నట్టగా.

''ఇప్పుడే ఇబ్బంది పడుతున్నామా? ఇదివరకు ఏ ఇబ్బందీ పడలేదా? మీరు పడలేదు. అందుకనే మీకు తెలియటం లేదు. డబ్బుకోసం ఎంత ఇబ్బంది పడేవాళ్ళం! ఔను. మీకేం ఇబ్బంది లేదు. పడిందంతా నేనే. డబ్బులేదని పద్మ పెళ్ళికి వెళ్ళడం మానేశాను. ''నీ పెళ్ళికి తప్పకుండా వస్తా''నని ప్రామిస్ చేశాను. మాట నిలుపుకోలేకపోయాను. అది ఎంత రంపపుకోతో మీకెట్లా అర్థమవుతుంది. అటువంటి ఇబ్బంది మీరెప్పుడూ పడలేదు. మీ ఖర్చులకి మీకు డబ్బు ఎక్కడనుంచైనా వస్తుంది! అప్పైనా చేస్తారు. నీరసంగా ఉన్నా, హార్లిక్సు తాగటం మానేశాను ఖర్చు తగ్గించాలని. పండగకి కూడా ఒక్క మంచి చీర కొనుక్కోలేకపోయేదాన్ని....''

''ఫుల్‌వాయిల్ చీర కొనలేదూ క్రిందటి....''

''అంతేకదా! అందరూ పట్టుచీరలూ, నైలాన్ జార్జెట్లు, వూలీలు కట్టుకుంటున్నారు. సినిమాకి వెళ్ళాలన్నా ఆలోచనే. పార్టీకి ఎవరేనా పిలిచినా భయమే... డాక్టర్ దగ్గరకి వెళ్ళటానికి సంకోచమే... ఎందుకూ? డబ్బులేక... మీకు చెప్పుకోలేక... చెప్పినా అర్థంకాక... అంది ఆవేశంగా సులోచన.

''నీ ఒక్కర్తికే కాదు. అందరికీ ఈ ఇబ్బందులుంటాయి. డబ్బు చాలుతోంది అనే మహాత్ముడు ఎక్కడ ఉన్నాడూ! పోనీ ఓ పెద్ద ఆఫీసర్ని చేసుకోలేక పోయావా?'' అన్నాడు శివరామ్ ఎగతాళిగా.

''చేసుకునేదాన్నే. కట్నం అడిగినవాణ్ణి చేసుకోను అనే వ్రతంపట్టి మీ పాలపడ్డాను. కట్నం అక్కర్లేదంటే ఎంతో ఆదర్శవంతుడు అనుకున్నాను...''

''ఇప్పుడు నీకొచ్చిన లోటు ఏమిటో! ఎంత చేసినా, ఎన్ని కొన్నా మీ ఆడజాతికి తృప్తిలేదు''.

''అసలు మీమీద ఆధారపడబట్టేకదా ఈ అవస్థ! మిమ్మల్ని మేము కోరవలసిరావటం. మీరు మాకు తృప్తిలేదనటం! స్త్రీ తనని తాను పోషించుకో గలిగితే ఈ గొడవరాదు. మేమూ ఉద్యోగం చేస్తాం. డబ్బు సంపాదిస్తాం. ఎందుకు ఒప్పుకోరు? ఉద్యోగంలో చేరింది మొదలు ప్రతిదానికీ ''నేను వద్దని చెప్తే విన్నావా?'' అని ఏదో తప్పు పని చేసినట్లు దెప్పడం!''

శివరామ్‌ని నీరసం ఆవరించుకుంది.

''ఎందుకు వద్దంటాం. ఇల్లుకూడా సమర్థించుకుంటే! ఉద్యోగం అంటే... ఇల్లు వదిలేసిపోతావు. ఇల్లు ఒక అడవిలా, పిల్లలు దిక్కులేనివాళ్లలాగ తయారవు తున్నారు. ఎవరు సంతోషిస్తున్నట్టు, ఎవరు సుఖపడుతున్నట్టు? డబ్బు సంపాదించ గానే సరా! పెళ్ళి చేసుకునేది దేనికి? వేళకి అన్నీ అమరుస్తుంది. సుఖపెడుతుంది అనేకదా! సంసార సుఖం లేకపోయాక ఇంక పెళ్ళెందుకు?'' అన్నాడు.

సులోచన కళ్ళనిండా అసహ్యం పేరుకుపోయింది. నిరసనగా చూస్తూ, ''ఎంత స్వార్థం? ఎంతసేపూ మీ సుఖం, మీ అవసరాల గురించే ఆరాటం. భార్యకి ఆకలితీరిందో లేదో మీకు పట్టదు. కట్టుకోడానికి గుడ్డలున్నాయో లేదో మీకు అవసరం లేదు. వంట్లో బాగుండక పోయినా మీకు వేళకి అన్నీ అమర్చాలి. బాబు పుట్టే ముందర ఒకరోజు నాకు తలనొప్పిగా ఉండి పడుకుంటే మీకు కోపం వచ్చి హోటల్‌కి వెళ్ళిపోయారు. నాకు ఆరోజంతా తిండిలేదు....

''ఎప్పటి సంగతో! అన్నీ తవ్వుతావు. నాకసలేం గుర్తులేదు''

''ఔను. గుర్తుండదనే నా బాధ. భర్త అవసరాలు భార్య తీర్చాలి. మరి భార్య అవసరాలు ఎవరు తీరుస్తారు? భర్తే కదా! మీకసలు ఆ దృష్టి ఉందా?.... ఇంక నేను ఇబ్బందిపడదలుచుకోలేదు. పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయ్యారు. స్కూల్‌కి వెడుతున్నారు. నా చదువు, కాలం వృధా చేస్తూ గడపలేను నేనింక. మీమీద ఆధారపడినకొద్దీ నేనంటే మీకు చులకన, నిర్లక్ష్యం!''

''అన్యాయంగా మాట్లాడకు సులో! నేనెప్పుడూ నిన్ను....'' సులోచన అతడిని మాట్లాడనివ్వలేదు.

''మనసుపడి పట్టుచీర అడిగితే. ''మా వదినతో వంతుకు వెళ్ళకు?'' అన్నారు. మీ వదిన కట్నం తెచ్చింది అనే కదూ!''

''కాదు. నా సంపాదన తక్కువ అని''

''మీ స్నేహితుడుకి అప్పు ఎలా ఇచ్చారు? మీకిష్టమైతే సరి. రికార్డ్ ప్లేయర్ కొన్నారు!''

''నా ఒకడికోసం కాదు. పాటలు అందరూ ఆనందిస్తారు!''

''ఔను, నాకు చీరలు లేకపోయినా ఫరవాలేదు. నా అవసరాలు తీరకపోయినా, మనసు తీరకపోయినా, మీకు బాధలేదు. అదీ నేను సహించాను. నేను సంపాదిస్తుంటే మీరెందుకు బాధపడాలి?''

''నేనుకాదు నువ్వే బాధపడుతున్నావ్ సులో. ఇంటి పని, ఉద్యోగం రెండూ చెయ్యలేక కష్టపడుతున్నావ్.... అంటున్నాను''

''ఉద్యోగం మానెయ్యమంటారు అంతేనా! దీనికి ఇంకో పరిష్కారం మీకు తోచదా? ఇంటి చాకిరీ చేస్తూ, మీరు దయదలచి ఇచ్చిన దానితో తృప్తిపడుతూ, కోరికల్ని చంపుకుంటూ, జీవచ్ఛవంలా, మీ బానిసలా బ్రతకాలి. అంతేగా!''

శివరామ్ బలవంతంగా నవ్వు తెచ్చుకున్నాడు. పెదవుల మీదికి. ''ఇంకోమార్గం వుంటే చెప్పు. తక్షణం పాటిస్తాను'' అన్నాడు.

''నేను చెప్పాలి... సిగ్గువిడిచి. ఆడదానికి సిగ్గు ఉండకూడదు. సిగ్గు వదిలేస్తేకానీ బ్రతకలేదు. అబద్ధమాడితేగానీ ఆడది బతకలేదు. నటిస్తేనేకానీ ఆడదానికి రోజు గడవదు. ఎందుకు? ఎందుకిట్లాగ ఉండాలి? దీన్ని ఎందుకు సహించాలి? ఆడది మనిషి కాదూ... మనసూ, మెదడులేవా? నాకేమనిపిస్తుందో తెలుసా?

శివరామ్‌లో అప్పటికి పూర్తిగా సహనం నశించింది.

''ఓ కప్పు కాఫీకోసం ఇంత గొడవా?''

''నేను కష్టపడివచ్చాను. నాకూ ఓ కప్పు కాఫీ కావాలి''

''ఐతే నన్ను ఇమ్మంటావా?''

''ఇస్తే తప్పా?''

''నేనిప్పుడే స్కూల్‌నుంచి వచ్చాను. ఇప్పుడు తలనొప్పి కూడా మొదలైంది''

''సరే. నేను హోటల్‌కి పోతున్నా.''

''ఆగండి. నేను కూడా వస్తా'', ''నువ్వెందుకు''

''నేనే పెట్టుకుంటానులెండి నా ఖర్చు''

''అక్కడికి వెళ్ళే బదులు కాస్త కాఫీ కలిపితే పోలా?''

''అంత తేలికైతే మీరు చెయ్యండి!''

''నువ్వు రేపటినుంచి ఉద్యోగం మానెయ్యి. ఇవేళ కాఫీ చెయ్యమంటున్నావు.. రేపు ఇంకేమంటావో! డైవోర్స్ ఇమ్మంటావు'' నిష్ఠూరంగా అన్నాడు.

''ఔను కలిసి బ్రతకలేకపోతే, సహకారం లేకుండా ఒక ఇంట్లో పులి - మేక లాగ బ్రతకటంకంటే విడిపోవటం ఇద్దరికీ మంచిది. అంతేకానీ నేను ఉద్యోగం మానను. నేను మరలాగ, బానిసలాగ, బ్రతకలేను'' దృఢంగా అంది సులోచన.

శివరామ్ తదేకంగా సులోచన కళ్ళలోకి చూశాడు.

''విడిపోవటం మంచిదా?'' అతడి కంఠంలో బాధ తొణికిసలాడుతోంది.

సులోచన మొహం పాలిపోయింది.

''నువ్వు ఇదివరకు ఇట్లాగ మాట్లాడేదానివా? నేను వచ్చేసరికి నవ్వుతూ ఎదురు వచ్చేదానివి. నా మాటని ఎప్పుడూ కాదు అనేదానివి కాదు. నాలుగు రాళ్ళు సంపాదించేసరికి మారిపోయావు. నీ ఇష్టం వచ్చినట్లుండవచ్చని భ్రమపడుతున్నావు. పరిష్కారం అంటున్నావు. ఏమిటా పరిష్కారం? నేను చేసి నీకు అందించటమే కదూ. ఉద్యోగంలో చేరాక నీకు భయం పోయింది. నోరు వచ్చింది.....''

ఇంతదాకా వచ్చేటప్పటికి సంభాషణ అసహ్యం కలిగిస్తోంది సులోచనకి. ఐనా ఆపకూడదనుకుంది. దీని అంతు తేల్చుకోవాలి.

''ఔను. నాకు నోరు వచ్చింది. ధైర్యం వచ్చింది. అదే ఆర్థిక బల ప్రభావం. ఇన్నాళ్ళూ మీరు చూపించలేదూ?''

''ఐతే నువ్వు డబ్బు సంపాదిస్తే ఇంక నాకూ పిల్లలకీ తిండి ఉండదన్నమాట!''

''బయట ఉద్యోగం చేసివచ్చి, ఇంట్లో చాకిరీ అంతా చెయ్యటం నావల్లకాదు''.

''ఏమైనా చేసుకో. నేను హోటల్‌కి పోతున్నా''

సులోచన సమాధానం చెప్పలేదు. ఒక నిమిషం మౌనంగా ఉండి లేచి లోపలకి వెళ్ళిపోయింది.

ఇంక కాఫీ చేస్తుందిలే అనుకున్నాడు శివరామ్. ఐదు నిమిషాలు గడిచాయి. కాఫీ రాలేదు. సులోచన రాలేదు. లేచి కిచెన్‌లోకి వెళ్ళాడు. కప్పులందించి సులోచనకి సాయం చేద్దామనుకున్నాడు. గాస్‌మీది కుక్కర్ ఉంది గాస్ నీలంగా మండుతోంది.

సులోచన కూర తరుగుతోంది. కాఫీ తయారవుతున్న చిహ్నాలేవీ లేవు అక్కడ. సులోచన ఒకసారి తలెత్తి అతడినిచూసి మళ్ళీ తన పనిలో లీనమైపోయింది.

శివరామ్ మళ్ళీ హాలులో కూర్చున్నాడు.

హోటల్‌కి వెడదామనిపించింది. కానీ ఎందుకో వెళ్ళలేకపోయాడు. ఒకసారి చెప్పులు తొడుక్కుని మళ్ళీ విప్పేశాడు. మతిపోయినట్లుగా ఉంది. రోజూలాగ సెంటర్‌కి వెళ్ళాలనిపించలేదు.

పిల్లలిద్దరూ వచ్చారు. వాళ్ళు ఏమడిగినా అతడు వినిపించుకోలేదు. సులోచన వాళ్ళిద్దరినీ స్నానానికి తీసికెళ్ళింది. గుడ్డలు తొడిగి తలలు దువ్వింది. బెడ్‌రూమ్‌లో పక్కలు దులిపి వేసింది.

హాల్లో పిల్లల్ని కూచోబెట్టి హోంవర్క్ చేయిస్తోంది. శివరామ్ రోజూ స్నేహితులతో కాలక్షేపం కోసం కాఫీ తాగాక బయటికి వెళ్ళిపోతాడు. ఉన్నా ఇవన్నీ గమనించడు.

సులోచన చాలా పని చేస్తోంది. నిజంగా కష్టపడుతోంది. అతడు సులోచన కదలికల్ని చూస్తున్నాడు. అతడిలో కోపం తగ్గిపోతోంది. రోజూ ఇంట్లో ఉండడు. ఇవాళ అలాగే కూచుని ఉన్నాడు.

ఎనిమిది అయింది. సులోచన లేచివెళ్ళి కంచాలు పెట్టి వచ్చింది.

''భోజనానికి రండి''

లేచి వెళ్ళాడు. భోజనాలయ్యాయి. పిల్లలు పడుకున్నారు.

ఒక అరగంట తరువాత సులోచన వచ్చింది. లైటు ఆర్పి పడుకుంది. నడుంమీద చెయ్యి వేశాడు. ఆచేతిని తీసెయ్యలేదు సులోచన.

''కోపమా!'' తనవేపు తిప్పుకుంటూ అడిగాడు.

''ఎందుకూ!'' అంది నిర్లిప్తంగా.

''చాలా పని ఉంటుంది కదూ, ఇవేళే చూశాను.''

అరనిమిషం తరవాత అంది సులోచన.

''ఎంత పనైనా చెయ్యగలను. చేస్తాను, ఇంటికోసం పని చెయ్యటంలో ఆనందం ఉంటుంది. కానీ కొన్ని పొందాలనికూడా ఉంటుంది...''

అతడు వింటున్నాడని తెలుస్తోంది కొంచెమే వెలుతురువున్నా. పదిపాళ్ళు మెప్పు, పదిపాళ్ళు సానుభూతి, పదిపాళ్ళు సాయం - ఇవి ఉంటే మిగతా డెబ్భైపాళ్లూ అవలీలగా చెయ్యగలను...''

''ఇవేళ కాఫీ తాగలేదు మనం!''

''లోటుగా ఉందా?''

''రేపటి నుంచి కాఫీ నేను చేస్తాను''

''నేను చెయ్యననటం లేదు. నేను కాఫీ చేస్తే మీరు పిల్లలకి హోమ్‌వర్క్ చేయించాలి!''

''నువ్వు హోంవర్క్ చేయిస్తే నేను వంట చేస్తాను మార్పు కోసం! నాకేమనిపించిందో తెలుసా! వంతులకిపోయి యీవేళ కాఫీ తాగలేకపోయాం. రేపు ఆనందమనే అమృతాన్ని పోగొట్టుకుంటాం!''

''ఉద్యోగం మానమంటారు. అది నాకెంత బాధో తెలుసా? నేను మాత్రం మనిషినికాదూ! ఒక బొమ్మని. నీడనీనా?''

''కాదు, కాదు సులో! నువ్వు ఉద్యోగం చెయ్యి. నాకు బొమ్మ వద్దు. నాలో చైతన్యం కలిగించి, ఆనందం కురిపించే మనిషి కావాలి నాకు. నేను ఎప్పుడైనా అమానుషంగా ప్రవర్తిస్తే తిరగబడు. తెలిసిందా? విడిపోదాం అని మాత్రం అనకు!''

''అనను. అనను. ఎందుకంటాను'' అంది సులోచన.

మనసులకి తృప్తి కలిగిస్తూ ఒక చల్లటి భావం ఆవరిస్తోంది ఇద్దరినీ. ఆనందం పెనవేసుకుంది ఆ ఇద్దరినీ.

వనితాజ్యోతి, అక్టోబర్, 1974

* * * *